


# మాయదారి రోగం

- కోలపల్లి ఈశ్వర్

"మీకెంతమంది పిల్లలు?"
"ఇద్దరు"
"ఆపరేషన్ చెయ్యించుకున్నారా?"
"ఆఁ..."
"ఒకవేళ మళ్లీ ఎప్పుడైనా 'రికేనలైజేషన్' లాంటిది చేయించుకుని తిరిగి పిల్లల్ని కనే అవకాశం ఉందా?"
"లేదు"
"మీ పిల్లలు మంచివాళ్లేనా?"
"అంటే"
"తోకలేని కోతుల్లా నానా చండాలపు పనులు చేసే తుంటరి వెధవలా, లేక బుద్ధిమంతులేనా అని"
"బుధిమంతులే..."
"బళ్లోంచి స్నేహితుల్ని గ్రట్టా ఇంటికి తీస్కొచ్చి క్రికెట్టూ గట్టా ఆడుతుంటారా?"
"ఆడరు..."
"అన్నట్టు ఇద్దరూ మగపిల్లలేనా?"
"కాదు... ఒక మగ,,, ఒక ఆడ..."
"కాదు... ఒక మగ, ఒక ఆడ..."

"వాళ్లలో వాళ్లు తన్నుకుంటూ పెద్ద పెద్దగా కేకలేస్తూ చండాలంగా ప్రవర్తిస్తుంటారు?"

"లేదు."

"ఇక మీ ఆవిడ సంగతి చెప్పండి. ఆవిడ నోరు మంచిదేనా?"

"అంటే?"

"ఐ మీన్ సూర్యకాంతంలాగ పరమగయ్యాళి తనంతో పెంకు లెగిరిపోయేలా కేకలేస్తుం టుందా?"

"వెయ్యరు, ఆవిడదంతా అంజలీదేవి టైపు..."

"నీళ్ల కుళాయి దగ్గర కూడా పోట్లాడదా?"

"పోట్లాడదు..."

"పప్పూ ఉప్పుల కోసం ఇరుగుపొరుగుల దగ్గ రికి చేబదుళ్లకెళ్లే అలవాటుందా?"

"లేదు... అసలు అలాంటి అవసరం నేనె ప్పుడూ రానివ్వను. ఫస్టు తారీఖునాడు నెలకు సరిపడే సామాన్లు ఒక్కసారే తెచ్చి ఇంట్లో పడే స్తాను..."

"మీకు ఫస్ట్ తారీఖునాడు ఠంచనుగా జీతమొ స్తుందా?"

"ఆఁ వస్తుంది."

"ఒకవేళ ఫస్టుతారీఖు ఆదివారం గానీ, హాలిడే గానీ అయితే?"

"జీతం ఒకరోజు ముందుగానే ఇచ్చేస్తారు, ఐ మీన్ థర్టీయెత్‌న గానీ థర్టీ ఫస్టున గానీ..."

"ఒకవేళ లీపు సంవత్సరంలో ఫస్ట్‌తారీఖు ఆదివారం నాడొస్తే?"

"ట్వెంటీఎయిత్‌న ఇస్తారు..."

"వెరీగుడ్... అన్నట్టు మీకు తాగుడు అలవా టుందా?"

"లేదు..."

"పోనీ మీ ఇంటికొచ్చే బంధువుల్లో గానీ స్నేహితుల్లో గానీ ఎవరైనా తాగుతారా?"

"లేదు. నాకు తాగుడంటే చచ్చేంత అస హ్యం. తాగుబోతు లెవర్నీ నా దగ్గరి క్కూడా రానివ్వను..."

"గుడ్... మీకు సిగరెట్లు కాల్చే అలవా టుందా?"

"అదీ లేదు..."

"పోనీ చుట్టా బీడీ వగైరా...?!"

"ఊహుఁ... పొగంటే కూడా నాకు చచ్చేంత అసహ్యమే."

"పోనీ జర్దాపాన్లూ గట్రా నమిలి ఎక్కడ పడితే అక్కడ అసహ్యంగా ఊసే అలవాటుందా?"

"లేదు. కనీసం వక్కపొడి కూడా అంటు కోను..."

"గూడ్...అన్నట్టు మీరు వెజిటేరియన్లా నాన్ వెజిటెరియన్లా?"

"ఎన్‌వీనే."

"అయితే ప్రతిరోజూ చేపలూ, కోళ్లూ ఇంటికి తెచ్చుకుని బావి చుట్టూ నానాగత్తరా చేస్తుంటార న్నమాట?!"

"చెయ్యం, అసలు ప్రతిరోజూ మేం ఎన్వీ ఏం తినం. కేవలం సండేస్‌మాత్రమే? అదైనా డ్రెస్డ్ చికెనా? డ్రెస్డ్ ఫిష్షో తెచ్చుకుంటామే తప్ప... బ్రతికున్న వాటిని తెచ్చి ఇల్లంతా ఖరాబు చెయ్యం..."

"అయితే ఫర్వాలేదు... అన్నట్టు మీరు వారా నికి ఎన్నిసార్లు స్నానం చేస్తారు?"

"వారానికి ఇన్నిసార్లని కాదు... ప్రతిరోజూ చేస్తాం రెండు పూటలా..."

"అలాగైతే ఇది కొంచెం ఆలోచించాల్సిన విషయమే... పోతే ఇంకో ప్రశ్న. మీరు వారానికి ఎన్నిసార్లు బట్టలుతుకుతారు?"

"బట్టలు కూడా ప్రతిరోజూ ఉతుకుతాం..."

"అయితే ఇది కూడా ఆలోచించాల్సిన విష యమే... అన్నట్టు మీ ఇంట్లో పక్క, పిల్లిలాంటి పెంపుడు జంతువులేమైనా ఉన్నాయా?"

"జాలీ అని ఒక కుక్కపిల్లుందంతే! బొచ్చుకు క్కపిల్ల. చాలాముద్దుగా ఉంటుంది..."

"అది ఎవర్ని పడితే వాళ్లని కరుస్తుందా? పగలూ రాత్రీ అన్న తేడా లేకుండా అసహ్యంగా మొరుగుతుందా?"

"లేదు, అది ఎవర్నీ కరవదు, ఎప్పుడో గానీ అసహ్యంగా మొరగదు..."

"మొత్తానికైతే అసహ్యంగానే మొరుగుతుంద న్నమాట! దాన్ని గొలుసుతో కట్టేస్తారు? ఉచ్చలూ గట్రా పోసి నానా కంపూ చేస్తుందా?"

"కట్టం. ఫ్రీగానే వదిలేస్తాం. ఉచ్చలూగట్రా పోస్తుంది గానీ కంపు కంపు మాత్రం చెయ్యదు. చాలా పద్ధతిగల కుక్క చిన్నప్పట్నుంచీ చాలా డిసిప్లిన్డ్‌గా పెంచాం..."

"మీరు రోజూ ఎన్నిలీటర్లపాలు వాడతారు?"

"ఒకటిన్నర..."

"ఆవుపాలా, గేదెపాలా?"

"ప్యాకెట్టుపాలు..."

"అంటే గేదెపాలు అన్నమాట! ఆవుపాలు వాడ్డానికి మీకేవన్నా అభ్యంతరమా? ఎందు కంటే మాకు రెండు ఆవులున్నాయి..."

"ఆవుపాలు ఇంతవరకూ వాళ్లేదు... తప్పదూ అంటే ప్రయత్నిస్తాం మరి!"

"ప్రయత్నించడం కాదు. వాడి తీరాలి. ఆవు పాలు, గేదెపాలకన్నా చాలా శ్రేష్ఠమైనవి. అన్నట్టు మీ ఇంట్లో టీవీ, టేప్ రికార్డరూ ఉన్నాయా?"

"ఈ రోజుల్లో అవి లేనివాళ్లెవరుంటారు? ఐ మీన్ మనలాంటి మధ్యతరగతి వాళ్లలో..."

"మనలాంటి అని నన్ను కలపకు."

"పోనీ మాలాంటి...."

"గుడ్!... అలా అన్నారు బాగుంది! అన్నట్టు మీ టీవీనీ, టేప్‌రికార్డర్నీ చెవులు గింగుర్లెత్తిపో యేలా పెద్ద సౌండ్‌తో పెట్టి ఇరుగుపొరుగు వాళ్లకి భయంకరమైన ఇబ్బంది కలిగిస్తారా?"

"అలా ఏం చెయ్యం. మా ఇంట్లో ఎవ్వరికీ చెవుడు లేదు. మినిమం వాల్యూమ్‌లోనే పెట్టు కుంటాం."

"మీ ఇంట్లో ఫ్రిజ్జూ, గీజరూ, ఐరన్‌బాక్సూ వగైరా వగైరా సామాన్లన్నీ ఉన్నాయా?"

"ఉన్నాయి."

"అయితే కరెంట్ చాలా ఎక్కువ కాలుస్తార న్నమాట! నో ప్రాబ్లెం. సెపరేట్ మీటరేగా! అన్నట్టు మీ రెప్పుడైనా మీ భార్యని కిరసనా యిలు పోసి కాల్చిచంపడానికి ప్రయత్నిం చారా?"

"లేదు."

"పోనీ ఇకముందు ప్రయత్నించే ఉద్దేశమే మైనా ఉందా?"

"లేదు గాక లేదు. నా భార్యంటే నాకు చాలా ఇష్టం."

"అంటే మీరెప్పుడూ కీచులాడుకోరా? 'నేరక పోయి మిమ్మల్ని చేసుకున్నా' అని ఆవిడా, 'నా ఖర్మకాలి నిన్ను కట్టుకున్నా' అని మీరూ ఒకర్నొ కరు సూటిపోటీ మాటలనుకుని తన్నుకు చావ డాలూ గట్రా చెయ్యరా?"

"చెయ్యం. మాది చాలా అన్యోన్య దాంప త్యం."

"మీ పన్లు మీరే చేసుకుంటారా— లేక పనిమ నిషిని పెట్టుకుంటారా?"



మీ వారు పనిచేసే ఆఫీసులోని టైపిస్టు మీద అనవసరమైన అనుమానాలెందుకూ?
అడిగింది జ్యోతి వాణిని
ఆ...ఏంలేదు... ఒకప్పుడు నేనూ అక్కడ పనిచేసిన దాన్నే.

"పనిమనిషిని పెట్టుకుంటాం."

"పనిమనిషితో అక్రమ సంబంధం కూడా పెట్టుకుంటారా?"

"పెట్టుకోను. అయినా అలాంటి ప్రమాదమేమీ కలక్కుండా మా ఆవిడ ఏరికోరి ముసలి పనిమనిషిని పెడుతూ ఉంటుంది ఎప్పుడూ."

"అంటే మీ ఆవిడకి మీ క్యారెక్టర్‌మీద నమ్మకం లేదన్నమాట!"

"అలాగనేం కాదు. జస్ట్ ముందు జాగ్రత్తకోసం. అంతే!"

"ముందు చూపుండటం మంచిదేలే! అన్నట్టు మీ ఇంటికి చుట్టాలు తరచుగా వస్తుంటారా?"

"ఎప్పుడోగాని రారు."

"ఒకవేళ వస్తే ఎన్ని రోజులు ఉంటారు?"

"మూణ్ణాలుగు రోజులే!"

"ఒకవేళ అంతకన్నా ఎక్కువ రోజులుంటే?"

"ఉండరు."

"ఎందుకని?"

"నాలుగో రోజునుంచి మా ఆవిడ కూరల్లో ఉప్పూ్వా కారం ఎక్కువ వేయడం ప్రారంభిస్తుంది."

"వెరీగుడ్! చాలా తెలివైన ఇల్లాలు. అన్నట్టు మీ ఆవిడకి పాతబట్టలు వేసి స్టీలుగిన్నెలు కొనే అలవాటుందా?"

"ఉంది."

"మీ బట్టలే వేస్తుందా? లేక ఇరుగుపొరుగు వాళ్లు దండెంమీద ఆరేసిన బట్టలు కూడా వేసేస్తూ ఉంటుందా?"

"అలా ఎందుకు వేస్తుంది? మా ఆవిడకి దొంగబుద్ధి లేదు. అసలు దొంగతనం అనేది మా ఇంటా వంటా లేనేలేదు."

"సందర్భం వచ్చింది కాబట్టి అడుగుతున్నాను. మీ తరపు వాళ్లుగానీ, ఆవిడ తరపు వాళ్లుగాని ఎప్పుడైనా హత్యలూ గట్రా చేసి జైళ్లకు గట్రా వెళ్లారా?"

"లేదు. మా ఇద్దర్లో ఏ ఒక్కరికీ నేరచరిత్ర కలిగిన బంధువులుగానీ, స్నేహితులుగానీ లేరు."

"మరో పాయింట్. మీ ఇంట్లోగానీ, మీ బంధువర్గంలో ఎవరికైనా గానీ కుష్ఠు , క్షయలాంటి అంటువ్యాధులేమైనా ఉన్నాయా?"

"లేవు."

"ఒకవేళ ఉత్తరోత్తరా మీలో ఎవరికైనా అలాంటి అంటువ్యాధులొస్తే?"

"రావు."

"రావని గ్యారంటీ ఏముంది? మనుషులన్నాక ఎప్పుడైనా సరే ఎవరికైనా సరే ఎలాంటి రోగమైనా సరే రావచ్చు. కాబట్టి మీలో ఎవరికైనా సరే అలాంటి మాయదారి రోగాలొస్తే— ఆ దిక్కుమాలిన జబ్బుల్ని మా అందరికీ అంటిస్తూ ఇక్కడే ఉంటామంటే కుదర్దు. తక్షణం ఇల్లు ఖాళీ చేసేయాల్సి ఉంటుంది. అందుకు సమ్మతమేనా?"

"సమ్మతమే!" అని అన్లేదు సోమేశ్వరరావు.

"చంపుతా మరొక్క మాటగాని మాట్లాడావంటే!" అన్నాడు ఉగ్రనరసింహావతారంలా ఊగిపోతూ.

"యూ ఆర్ ఎక్సీడింగ్ యువర్ లిమిట్స్. అద్దె ఇంటికోసం వచ్చిన వాడివి అంత రోషమైతే ఎలా గోయ్?" అంటూ స్తంభానిక్కట్టిన టూలెట్ బోర్డుని కావలించుకున్నాడు హాయగ్రీవాచారి. 'నీకు నా ఇల్లు చచ్చినా అద్దెకివ్వను పో' అన్నట్టుగా.

"గో టు హెల్ విత్ యువర్ బ్లడీ అద్దె ఇల్లు. అంత అవసరమైతే చెట్టుకిందైనా ఉంటాగానీ, ఈ చంఢాలపు ఇల్లు నాకేం అవసరంలేదు."

సోమేశ్వరరావు అలా అనేసి విసవిసా వెళ్లిపోతుంటే అతనికేసి జాలిగా చూశాడు హయగ్రీవాచారి.

ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు ఆమాత్రం మంచీ చెడ్డా అడిగి తెలుసుకోరా? మాయదారిరోగం కాకపోతే. దానికింత కోపమెందుకు? బొత్తిగా ఇంగితం లేని మనిషి!! ఎలా బ్రతుకుతాడో ఏమో!! అనుకున్నాడు బాధగా.

అలా అనుకుంటుంటే అతని హృదయం కరిగి నీరై కాళ్లమీద పడిపోయింది. ★

## కొత్తదనానికి ఆహ్వానం

కొత్తతరానికి, కొత్తదనానికి 'ఆంధ్రప్రభ' ఆహ్వానం పలుకుతోంది. భిన్నమైన అంశంతో రాసిన కథలు, వ్యాసాలకు స్వాగతం. మీ రచనలు అనుకరణలు కానీ అనుసరణలు కానీ కాకూడదు. రచన మీ సొంతమనే హామీ పత్రం కథతో/ వ్యాసంతో జతచేయాలి. ఇంతకుముందే అచ్చయిన కథను కానీ వ్యాసాన్ని కానీ పంపకూడదు. అలాగే ఇతర భాషల్లో రచనల అనువాదాలు పంపకూడదు. మీ కథలను / వ్యాసాలను పరిశీలించి అర్హమైనవి అని నిర్ధారించుకుంటే వీలువెంబడి ప్రచురిస్తాం.



**మీ రచనలు పంపవలసిన చిరునామా:**

ఎడిటర్, ఆంధ్రప్రభ
ఎక్స్‌ప్రెస్ సెంటర్, వాల్మీకినగర్,
లోయర్ టాంక్‌బండ్ రోడ్, దోమలగూడా,
హైదరాబాద్ - 500029

❑ మీ రచనలపై ఎలాంటి ఉత్తరప్రత్యుత్తరాలకు అవకాశం లేదు. మీ రచనలు ప్రచురించని పక్షంలో మీకు తిరిగి పంపాలంటే పోస్టేజి స్టాంపులు అంటించిన రిప్లై కవరు జత చేయవలసి ఉంటుంది.
❑ రచనలు అచ్చులో రెండు, మూడు పేజీలకు మించకూడదు. ❑ మీ రచనలపై 'ఆదివారం అనుబంధం కోసం' అని స్పష్టంగా రాయండి.